క్లుప్తంగా

ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండల పరిధిలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా బుధవారం మండలంలోని తాటిసుబ్బన్నగూడెం నివాసంలో ఎమ్మెల్యేకు, అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దమ్మపేట గ్రామంలో ఇటీవలే ప్రమాదానికి గురిన్న దారా ధర్మేంద్రను పరామర్శించారు. పలు గ్రామాల్లో మండపాలతో కొలువైయున్న గణేషుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గణేషుడి మండపంలో నిర్వహించిన అన్నదానంలో ఎమ్మెల్యే పాల్గొని, భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు దారా యుగంధర్, యార్లగడ్డ బాబు, చిన్నశెట్టి సత్యనారాయణ, జిన్నా, పానుగంటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మురికినీటితో ఇక్కట్లు



రాజీవ్‌గాంధీ నగర్‌లో ప్రవహిస్తున్న మురుగు

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ రాజీవ్‌గాంధీనగర్ లోని రాధికా కాన్సెప్ట్ స్కూల్ వద్ద ఉన్న రోడ్లు మురికినీటితో ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఇళ్లలో నుంచి వచ్చే మురికినీరు సైడ్ డ్రెయిన్లు మూసుకుపోవడంతో రోడ్ల మీద చేరుతున్నాయి. దీంతో ఆ వీధుల్లో ప్రయాణించే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై మురికినీరు చేరిన దానిని శుభ్రపర్చడంలో సమితిసింగారం పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆ ప్రాంత వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఊరేగింపులు



అశ్వారావుపేటరూరల్: ఆటోలో విగ్రహాన్ని తరలిస్తుండగా.. చిన్నారుల సందడి

అశ్వారావుపేటరూరల్: వినాయక చవితి సందర్భంగా కొలువుదీరిన బొజ్జ గణపయ్య విగ్రహాలను బుధవారం ఘనంగా ఊరేగించారు. మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, వినాయకపురం, తిరుమలకుంట, ఊసిర్లగూడెం, అనంతారం, అశ్వారావుపేటతోపాటు పలు గ్రామాల్లో మూడో రోజు సందర్భంగా మండపాల వద్ద భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

క్రమశిక్షణ కలిగి ఉండాలి

ములకలపల్లి: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ) బి.సులోచనారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఫ్రెషర్స్‌డే'ను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడారు. లక్ష్య సాధనకు నిరంతరాయంగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. లెక్చరర్లు చావ రాజేశ్వరి, మైలగాని చంద్రశేఖర్, రామకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

దమ్మపేట: డీఎల్‌డీఏ, పశుగణాభివృద్ధి సంస్థ, వైరా వారి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ తోట నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు యాట్ల సావిత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. పశువులకు గర్భకోశ, సాధారణ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. నట్టల నివారణ మందు, మినరల్ మిక్చర్‌ను పాడి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి మన్యం రమేష్, గోపాల మిత్రలు చెన్నయ్య, వేణు, జగ్గయ్య, శివ, దీపక్, రైతులు సహాదేవుడు, రామదాసు, రవి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం..

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం కాటాయిగూడెంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ నూపా సుమిత్ర ప్రారంభించగా ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఈ ఉషారాణి, డాక్టర్ జ్యోతి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఆయుర్వేద వైద్య సిబ్బంది ఈశ్వరి, వీరభద్రరావు, ఆశా వర్కర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో అక్రమాల పర్వం

- తహసీల్‌లో సిబ్బంది ఇష్టారాజ్యం
- గిరిజనేతరుల మధ్య భూబదిలీలు.. నిబంధనలు బేఖాతర్
- వారసత్వం, వాటాల పేరుతో దగా



దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం

దమ్మపేట: మండలంలో ఏజెన్సీ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంత భూముల రిజిస్ట్రేషన్లు చేయాలంటే 1/70 చట్టం నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. కానీ అవేమీ లేకుండానే యథేచ్ఛగా పని కానిచ్చేస్తున్నారని తెలుస్తోంది. మండల కేంద్రంలోని తహసీల్‌లో పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగి ఒకరు ఇందుకు సహకరిస్తుండగా.. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అక్రమాలు ఇలా...

దమ్మపేటట మండల పరిధిలో పలు ఏజెన్సీ గ్రామాలు ఉండగా... అధిక శాతం గిరిజనులే నివసిస్తున్నారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం.. ఇక్కడ భూముల క్రయవిక్రయాలు జరగాలంటే గిరిజనుల మధ్య మాత్రమే సాధ్యమవుతుంది. ఇక 1/70 చట్టానికి ముందుగా ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టా భూములు కలిగిన గిరిజనేతరులు ఆ భూములను వారసత్వంగా అనుభవించాలే తప్ప అమ్ముకోవడానికి వీలులేదు. ఒకవేళ ఎవరైనా మరణిస్తే వారి వారసులకు భూమి బదిలీ అవుతుంది. కానీ తహసీల్‌లోని కాంట్రాక్టు ఉద్యోగి ఒకరు నిబంధనలకు విరుద్ధంగా వారసత్వం లేదా కుటుంబంలో భూమి వాటాల విభజన పేరుతో రక్త సంబంధం లేని గిరిజనేతరుల మధ్య క్రయవిక్రయాలకు సహకరిస్తున్నాడని సమాచారం. ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర కూడా ఉందని తెలుస్తోంది.

కాంట్రాక్టు ఉద్యోగి లీలలు

తహసీల్‌లో ఐదేళ్ల నుంచి కాంట్రాక్ట్ విధానంలో ఓ ఉద్యోగి పనిచేస్తున్నాడు. మండలంలోని మీ సేవ నిర్వాహకులు భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దరఖాస్తు చేయాలంటూ తొలుత తనకు సమాచారం ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. ఒకవేళ ఎవరైనా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ పని చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా మండలంలోని పలు గ్రామాల్లో దళారులను ఏర్పాటు చేసుకుని బేరసారాలు నడిపిస్తున్నట్లు తెలిసింది. ఏజెన్సీ ప్రాంతంలో రక్త సంబంధం, వారసత్వం లేని గిరిజనేతరుల మధ్య జరిగిన భూబదిలీల సందర్భంగా ఎకరాకు రూ.లక్ష నుండి రూ.1.50లక్షల వరకు చేతులు మారుతున్నట్లు సమాచారం.

తీవ్ర నేరంగా పరిగణించాలి..



ఆదివాసీల ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ రిజిస్ట్రేషన్లపై అధికారులు దృష్టి సారించాలి. గిరిజనుల విషయంలో కొర్రీలు పెడుతున్న సిబ్బంది.. గిరిజనేతరుల పని మాత్రం చేస్తున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి.

– సోడెం వెంకట్, ఆదివాసీ నాయకుడు

నా దృష్టికి రాలేదు...



ఏజెన్సీలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం నా దృష్టికి రాలేదు. ఇలాంటి ఏమైనా ఉంటే నాకు ఫిర్యాదు చేయండి. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఇలాంటి జరిగినట్లు ఎవరూ ఫిర్యాదు చేయకున్నా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– ముజాహిద్, తహసీల్దార్

క్రీడారంగ అభివృద్ధికి కృషి



మణుగూరురూరల్: క్రీడాకారులతో కలిసి ఆడుతున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో మండల స్థాయి క్రీడా ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ప్రారంభించారు. తొలుత క్రీడాకారులకు కరచాలనం చేస్తూ.. పరిచయం చేసుకున్నారు. కొద్దిసేపు క్రీడలు ఆడుతూ వారిలో నూతనోత్సాహాన్ని నింపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ఎంపీటీసీ బేగా రమ్య, సర్పంచ్‌లు బచ్చల భారతి, కారం ముత్తయ్య, ఎంఈఓ వీరస్వామి, సీఐ బాలాజీ వరప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం నాగశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ప్రారంభం..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు, మొండికుంట, రామచంద్రాపురం గ్రామాల్లో రూ.1 కోటి 25 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం ప్రారంభించారు. మల్లెలమడుగులో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి రేగా పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కోడి కృష్ణవేణి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే రేగాను గజమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, సర్పంచ్‌లు మర్రి మల్లారెడ్డి, గొర్రెముచ్చు వెంకటరమణ, ఎంపీటీసీలు బేతం రామకృష్ణ, గాదె జయ, తాటి పూజిత, సీఐ రవీందర్, ఎంపీడీఓ వరప్రసాద్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అద్దె కేంద్రం ప్రారంభం..

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వెలుగు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కస్టం హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ)గా పిలుచుకునే వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం సత్యనారాయణ, అశ్వాపురం ఉపసర్పంచ్ చందూలాల్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జోనకేత్రి, కార్యదర్శి కమల, కోశాధికారి లలిత, ఐకేపీ సీసీలు, రాధారెడ్డి, శోభ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక..

కాగా, మొండికుంట, రామచంద్రాపురం గ్రామపంచాయతీలలో వివిధ పార్టీలకు చెందిన 250 కుటుంబాలు ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి రేగా బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మొండికుంటలో పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు.

చర్లలో కార్గో సేవలు ప్రారంభం



కార్గో పాయింట్‌ను ప్రారంభిస్తున్న హరివర్మ

చర్ల: చర్లలో టీఎస్ ఆర్టీసీ కార్గో, పార్సిల్ సేవలను టీఎస్‌ఆర్టీసీ రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హరివర్మ బుధవారం ప్రారంభించారు. చర్లలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు ఈ కౌంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు బెంగుళూరుకు కూడా కార్గో సర్వీస్ ద్వారా తక్కువ ధరకే పార్శిళ్లు, కవర్లు, పంపించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.రవికుమార్, మణుగూరు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.సైదులు తదితరులు పాల్గొన్నారు

మండపాల వద్ద అన్నదానం



మణుగూరురూరల్: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్

మణుగూరురూరల్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మణుగూరు పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు పూజలందుకుంటున్నారు. బుధవారం పోలీస్ సిబ్బంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఐ బాలాజీ వరప్రసాద్, ఎస్సై శ్రీనివాస్‌లు ప్రారంభించగా.. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎన్టీఆర్ సెంటర్‌లోని గణపతి మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భక్తులు మండపానికి చేరుకుని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొనగా.. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని మర్కోడు పంచాయతీ కేంద్రంలో బొడ్రాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొడుకు చెందిన తాళ్లపల్లి నవీన్ సునీత దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేఖర్ శ్రావణ్ సతీష్ వెంకన్న, వెంకట్, నవీన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేత అయోధ్య

మణుగూరుటౌన్: రెండు సంవత్సరాల నుంచి సింగరేణి ఏరియా కార్మికులకు అగ్రిమెంట్ చేయకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గుమస్తాలకు ఒక్కరూపాయి కూడా చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అఖిలపక్షం నేతలు ఆరోపించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో బొగ్గు ముఠా కార్మికులు, కోల్ ట్రాన్స్‌పోర్ట్ గుమస్తా కార్మికులతో జరిగిన సమావేశంలో అఖిలపక్ష నాయకులు పాల్గొని మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక కార్మికుల్లో చీలికలు సృష్టించారని ఆరోపించారు. ఇదే పద్ధతి కొనసాగితే కార్మికుల హక్కుల కోసం ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బొల్లోజు అయోధ్య, కేవీరావు, సంతోష్, కాటబోయిన నాగేశ్వరరావు, ముత్యాల వెంకటేశ్వరరావు, లింగంపల్లి రమేశ్, ఆర్ మధుసూదన్‌రెడ్డి, మిడిదొడ్ల నాగేశ్వరరావు, ఉప్పుతల వెంకటేశ్వరరావు,కూచిపూడి బాబు, వెలగపల్లి జాన్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రచారం



అశ్వారావుపేటరూరల్: ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ పథకాలపై బుధవారం ఆ పార్టీల బాధ్యులు బుధవారం పోటాపోటీగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలోని సంతమార్కెట్, భద్రాచలం రోడ్, బస్టాండ్ సెంటర్, పాత ఆంధ్రా బ్యాంక్, పోలీస్ స్టేషన్ సెంటర్, రింగ్ రోడ్ సెంటర్లలో ముందుగా స్థానిక మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ ఆరు గ్యారెంట్ కార్డు పథకాల గురించి గడపగడపకూ వెళ్లి కరపత్రాలను అందించారు. అలాగే ములకలపల్లి జెడ్పీటీసీ, టీపీసీసీ సభ్యురాలు సున్నం నాగమణి ఆధ్వర్యంలో కూడా అశ్వారావుపేటలోనే గడపగడపకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకు వచ్చే ఎన్నికల్లో ఒక్క అవకాశాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు జ్యేష్ఠ సత్యనారాయణ, దాసరి నాగేంద్ర, ఆకిరిపల్లి రాంబాబు, బండారు శ్రీను, భూక్యా ప్రసాద్, తుమ్మా రాంబాబు, కొప్పుల శ్రీను, ఎం.శిరీష, ఎస్‌కె.బాబా, ఎస్‌కె.షుకూర్ పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం, మంగలిగట్టు, గాంధీబొమ్మ సెంటర్, గణేశ్ బజార్ ఏరియాలలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు పాయం వెంకటేశ్వర్లు గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి ఆరు గ్యారెంటీలను వివరించి కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం పలు కుటుంబాలకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవీ రావు, తాటిభిక్షం, రాజేశ్, మధు, చింతల కృష్ణ తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యను కొత్తగూడెం నియోజకవర్గ బి.బ్లాక్ డెలిగేట్ రాయల శాంతయ్య బుధవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాబోయే జిల్లాలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, రంగారావు, వెంకటేశ్వరరావు, వెంకన్న గౌడ్, చారి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను మార్చండి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని మార్చాలని కాలనీ వాసులు బుధవారం స్థానిక ఎంఈఓకి ఫిర్యాదు చేశారు. తమ పిల్లకు విద్యాబుద్ధులు నేర్పిస్తారని పాఠశాలలో చేర్పిస్తే పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు వారు ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి హెచ్‌ఎంను మార్చకుంటే పిల్లలను పాఠశాలకు పంపబోమని స్పష్టం చేశారు.

చదువులకు చేయూత

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామంలో కూలిపనులతో జీవనం సాగిస్తున్న బాబురెడ్డి పిల్లల ఉన్నత చదువుల కోసం ఇదే గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. బుధవారం ట్రస్ట్ ప్రతినిధులు రూ.30 వేలు ఆర్థికసాయమందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, చింతా అంకిరెడ్డి, ఇళ్ల వెంకట రాజేష్, బత్తుల రామకొండారెడ్డి, ఆవుల శివ నాగిరెడ్డి, పేరం రామిరెడ్డి, డి.బాలనారాయణరెడ్డి, బత్తుల మల్లీశ్వరి, ఇండ్ల సౌజన్య, ఆవుల మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ మహిళా మోర్చా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ములిశెట్టి రామ్మోహన్‌రావు, ముక్కెర కోటేశ్వరి, వెంకన్న, చక్రవర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజన్సీలోని ఆదివాసీ గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్యను మెరుగుపరిచి ఉపాధి అవకాశాలను కల్పించాలి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పీఓకి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న పారిశ్రామిక కర్మాగారాల్లో గిరిజనులకు ఆదివాసీ చట్టాల ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిచాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య దొర, ప్రధాన కార్యదర్శి భట్టు కనకరాజు, సోలం రామారావు, నాగేంద్రబాబు, రమణబాబు పాల్గొన్నారు.

అరెస్ట్‌పై నిరసన

అశ్వారావుపేటరూరల్: టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు అరెస్ట్‌పై బుధవారం అశ్వారావుపేటలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కట్రం స్వామి, నార్లపాటి శ్రీను, సర్పంచ్ ఎన్ సుమతి, డేగల రాము పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ముట్టడి



మణుగూరురూరల్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మణుగూరురూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గత కొన్ని రోజులుగా చేపడుతున్న ఆందోళనలో భాగంగా బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు వేల్పుల మల్లికార్జున్, గద్దల శ్రీనివాసరావు, అక్కి నరసింహారావులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీ టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళనకు ఇఫ్టూ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి అరుణ, శ్యామల, విజయకుమారి, అరుణ, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బ్రహ్మాచారి, నర్సారెడ్డి, ఏజే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు పలికిన ఎమ్మెల్యే..

అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు బుధవారం భద్రాచలం శాసనసభ్యుడు పొదెం వీరయ్య పూర్తి మద్దతుని తెలియజేశారు. అనంతరం కార్మికుల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిలకు లేఖలు రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొదెం మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీల వేతనం పెంచాలని, వాడి డిమాండ్లన్నిటినీ అంగీకరించాలని అన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అప్పుడు తప్పక సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

తహసీల్దార్‌కు వినతి..

ములకలపల్లి: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణా ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ జి.పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా దుబ్బా ధనలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో మండల నాయకులు రాణి, నాగమణి, కుమారి, పార్వతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

పాయం మద్దతు..

మణుగూరుటౌన్: రాష్ట్రంలోని 60వేల మంది అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్‌లను సీఎం కేసీఆర్ పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మణుగూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం మద్దతు తెలిపి మాట్లాడారు. నాయకులు కేవీ.రావు, పుచ్చకాయల శంకర్, వీరంకి వెంకట్రామ్‌గౌడ్, సుబ్బారెడ్డి, తాటి భిక్షం, తిరుమలేశ్, మాదాడి రాజేశ చింతల కృష్ణ తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డుకు ఇరువైపులా చెత్త



మణుగూరులోని సీఎస్పీ కాటా వద్ద రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం ప్రజలకు దర్శనమిస్తోంది. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి చెత్తను సేకరించి డంప్ యార్డ్‌లో వేయాల్సి ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెత్తను ప్రధాన రహదారికి ఇరువైపులా వేస్తున్నారు. దీనివల్ల ప్రధాన రహదారిపై ప్రయాణించే వారికి తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ కమిషనర్ స్పందించి రోడ్డుకు ఇరువైపులా భారీగా పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – మణుగూరురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, మణుగూరు
ఫోన్ నంబర్: 9849909514